క్లుప్తంగా

మాజీ సైనిక ఉద్యోగుల సంఘం శ్రమదానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగుల సంఘం సభ్యులు గ్రామంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయం ప్రాంగణంలో శ్రమదాన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఆలయం ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించడం, చదును చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో భక్తులు తాకిడి ఎక్కువగా ఉన్నందున, ఇబ్బందులు లేకుండా ఆలయం చుట్టుపక్కల పరిశుభ్రం చేశారు.

వార్షిక బడ్జెట్‌పై సమావేశం



బడ్జెట్‌పై సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌పై ఎంపీపీ అంబటి నిర్మలా అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ రుప్పదివ్య, ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ, సూపరింటెండెంట్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్‌లో బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైస్ ఎంపీపీలు మీసాల సాద్విమణి, తోలేటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపోత్సవానికి వేదిక సిద్ధం



విద్యుత్ వెలుగులతో వేదిక

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈనెల 29న నిర్వహించనున్న అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవానికి వేదిక సిద్ధమైంది. విద్యుత్ వెలుగులతో వేదికను ఏర్పాటు చేశారు. అలాగే వేదిక ముందు దీపాలు వెలిగించేందుకు బారికేడ్లు నిర్మించామని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, పెంట శ్రీధర్‌శర్మలు తెలిపారు.

యువకుడు అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ పంచాయతీ కమ్మవానిపేట గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువకుడు గొవవర్తి హర్షవర్ధన్ అదృశ్యంపై తండ్రి ఉదయ్‌భాస్కర్ ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. బెంగుళూరులో సాంకేతిక విద్య చదువుతున్న ఈ యువకుడు ఈనెల 20న ఇంటికి వచ్చాడు. రాత్రి ఇంటి వద్ద నిద్రపోయిన వ్యక్తి 21న ఉదయం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు తమకు తెలిసినవారితో ఆచూకీ కోసం ప్రయత్నించారు. అయితే ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బయోసైన్స్ సెమినార్‌కు అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన బయో సైన్స్ సెమినార్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత పాల్గొన్నారు. మెదడు, నాడీ మండల వ్యాధి శస్త్రచికిత్స, వైద్య, జీవ రసాయన పరమాణు కారకాలపై ప్రసంగించారు. విస్తృత పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, వ్యాధుల నియంత్రణ చర్యలను వివరించారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ నిఘా



నాగావళి నది పరిసరాల్లో నిఘా చిత్రం

శ్రీకాకుళం క్రైమ్: నగర పరిధిలోని నిర్మానుష్య ప్రదేశాల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. శనివారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డ్రోన్ సర్వే జరిగింది. పీఎన్ కాలనీ, భైరవానిపేట, కిమ్స్ ఆస్పత్రి ఏరియా, శాంతినగర్ కాలనీ, నాగావళి నదీ పరిసరాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి సేవించడం, పేకాట, చైన్ స్నాచింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈవ్‌టీజింగ్ వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు.

సాగు పెరిగింది.. ధర తగ్గింది..!



- తగ్గుతున్న సరుగుడు, నీలగిరి ధరలు
- టన్నుకు రూ.2 వేలు వరకు తగ్గింపు
- ఆందోళన చెందుతున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల్లో రైతులు సరుగుడు, నీలగిరి తోటలు విస్తారంగా సాగు చేస్తున్నారు. భద్రాచలం, విజయవాడ, ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన నారును ఇక్కడ నర్సరీల్లో అమ్మకం చేస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...	
మండలం	సాగు(ఎకరాల్లో..)
ఎచ్చెర్ల	10,500
లావేరు	9,500
జి.సిగడాం	2,800
రణస్థలం	11,700

ప్రధానంగా వర్షాధార భూములు ఎక్కువగా ఉండడం, నదీతీర భూములు, సముద్ర తీరం భూములు ఎక్కువగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో నీలగిరి, సరుగుడు పంటలు సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత పంట చేతికి వస్తుంది. పంట, కర్ర నాణ్యత మెరుగ్గా ఉంటే రూ.5 లక్షల వరకు ఎకరాకు ఆదాయం వస్తుంది. అయితే ప్రస్తుతం ఒక్కసారి ధరలు తగ్గించడంతో గిట్టుబాటు ధరలు కిట్టటం లేదు. టన్నుకి సరుగుడు, నీలగిరి రూ.2 వేలు వరకు తగ్గడంతో ఆందోళన చెందుతున్నారు.

పేపర్ మిల్లులకు ఎగుమతి

రాజమండ్రి, కాకినాడ, విజయవాడ, భద్రాచలం, రాయ్‌ఘడ్ వంటి ప్రాంతాల పేపర్ మిల్లులకు సరుగుడు, నీలగిరి కలప సరఫరా చేస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కింతలిమిల్లు, అల్లిన

తొక్కతీసిన నీలగిరి దుంగలు

గరం, చిలకపాలేం, బొంతుపేట, చిగురు కొత్తపల్లి వంటి ప్రాంతాల్లో వేయింగ్ మిషన్ వద్ద సరుగుడు, నీలగిరి తూకం వేసి కొనుగోలు చేస్తారు. కర్ర నాణ్యత 18 అడుగుల పొడవు, మూడు ఇంచీలు మందం ఉంటే గతంలో రూ.10,800లకు టన్ను కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం రూ.8,200 కొంటున్నారు. నాణ్యత లేనివి రూ.7,500 నుంచి రూ.6,500 వరకు టన్ను కొంటున్నారు. కలప ధరలు ప్రభుత్వ నియంత్రణలో ఉండడం లేదు. పేపర్ మిల్లులు ధరలు నిర్ణయిస్తున్నాయి. ఇది రైతులకు సమస్యగా మారుతోంది.



లోడింగ్ చేసి రవాణాకు సిద్ధంగా ఉన్న సరుగుడు దుంగలు

ఆందోళన కలిగిస్తున్నాయి



ప్రస్తుతం గత రెండు నెలల నుంచి ఒక్కసారిగా ధర తగ్గిపోయింది. టన్నుకు రూ.2 వేలు వరకు తగ్గించారు. దీంతో పంటకు మెరుగైన ధర రావడం లేదు. రైతులు ఆందోళన చెందుతున్నారు. పేపర్ కంపెనీలు ధరలు నిర్ణయిస్తున్నాయి. పంటకోత ఎక్కువగా ప్రస్తుతం ఉండడంతో ధరలు తగ్గిస్తున్నట్లు తెలుస్తోంది.

– బస్వా గురుమూర్తిరెడ్డి, సరుగుడు రైతులు సంఘం జిల్లా అధ్యక్షుడు

మద్దతు ధర అందించాలి



ఇదివరకు ధరలు మెరుగ్గా ఉండడంతో సరుగుడు, నీలగిరి పంటల సాగుకు రైతులు ప్రాధాన్యతనిచ్చారు. ప్రస్తుతం తోటల సాగు విస్తీర్ణం పెరిగింది. దీంతో ఒక్కసారిగా ధరలు తగ్గించారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరలు అమలు చేయాలి. లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– బోర సాయి, అజ్జిరాం, ఎచ్చెర్ల

శిథిలావస్థకు పాఠశాల



ఎచ్చెర్ల మండలంలోని భగీరథపురం పంచాయతీ ఏజీఎస్‌పేట గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

దుర్గంధం



గార మండలంలోని తాళ్లవలస గ్రామంలో సీసీ రోడ్డుపై వాడుక నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. సీఎస్పీ రోడ్డు నుంచి ఈ రోడ్డు మీదుగా బోరవానిపేట, గార– చింతాడ రోడ్డుకు రాకపోకలు చేస్తుంటారు. బోరు జంక్షన్ నుంచి ఆంజనేయ స్వామి గుడి వరకు రోడ్డులపై స్నానాలు, వాడుకలు చేయడం, కిందకి వెళ్లే మార్గంలో మట్టి వేయడంతో నీరు చాలా రోజులుగా నిలిచిపోవడంతో దోమలకు నిలయంగా మారింది. దీంతో నీరు తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– గార

హరిదాసుల సందడి



ఎంతో ప్రాముఖ్యత కలిగిన ధనుర్మాసంలో నగరంలో హరిదాసులు సందడి చేస్తున్నారు. వేషధారణలో తలపై పాత్రతో, చేతిలో తంబూరాతో నగరంలోని వీధుల్లో తెల్లవారుజామునే హరినామ సంకీర్తన చేస్తూ సంచరిస్తున్నారు. కొందరు భక్తులు హరిదాసును పిలచి వారికి తోచింది దానం చేస్తున్నారు. వీరు నెల రోజుల పాటు నగరంలోని ప్రతి వీధిలోనూ తిరుగుతారు.

– శ్రీకాకుళం కల్చరల్

ఉపాధి పనులతో గ్రామాల ప్రగతి



మాట్లాడుతున్న పీడీ సుధాకర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి హామీ పనులతో గ్రామాలు ప్రగతి సాధిస్తాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలో సామాజిక తనిఖీల ప్రగతి నివేదిక సమావేశం శనివారం నిర్వహించారు. మండలంలో 28 పంచాయతీలు ఉండగా, రెండు పంచాయతీలు శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో ఉన్నాయన్నారు. దీంతో 26 పంచాయతీల్లో ఈ ఏడాది 2,618 పనులు నిర్వహించగా, రూ.32.19 కోట్ల బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం గ్రామాలకు కావాల్సిన మట్టి పనులు, వ్యవసాయ ఆధారిత పనులు, మెటీరియల్ కంపోనెంట్ పనులు, గోశాలలు మంజూరు చేస్తోందన్నారు. ఈ పనులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో పనిదినాలు పెంచాలని, నిబంధనలు మేరకు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ ఒత్తిడులు తగ్గాలని కోరారు. కార్యక్రమంలో ఏడీపీ రాధ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గౌరవ భృతి మంజూరు చేయాలి

- ఎంపీటీసీల నిరసన



నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

జి.సిగడాం: తమకు గౌరవ భృతి మంజూరు చేయాలని జి.సిగడాం మండలం ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, మీసాల సాద్విమణి, తోలేటి వెంకటరావు, కీర్తి తవుడమ్మ, మక్క శ్రీలత, గేదెల వరలక్ష్మి, పట్నాన శాంతి, బూట దమయంతి, కుదిరెళ్ల సూజాత, పరసరావు మంగమ్మ, తిరుమరెడ్డి విజయలక్ష్మిలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన మండల బడ్జెట్ సమావేశంలో గౌరవ సభ్యులంతా నిరసన తెలిపారు. తమకు రావాల్సిన ఏడాదిన్నర గౌరవ భృతి ఇవ్వాలని, తర్వాత బడ్జెట్ పెట్టాలని కోరారు. విజయనగరం జిల్లాలో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు ఇచ్చినా, తమకు మాత్రం ఇంతవరకు ఎందుకు వేతనాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో రామకృష్ణారావు మాట్లాడుతూ గౌరవ వేతనం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. నిధులు మంజూరు అవ్వగానే సభ్యుల ఖాతాకు జమ చేస్తామని పేర్కొన్నారు.

పాఠశాలలపై విశ్వాసం పెంచాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య



ప్రసంగిస్తున్న డీఈవో డాక్టర్ తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగం రోజురోజుకీ వ్యాపారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచాల్సిన బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)లు, ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎన్నికైన నూతన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు శ్రీకాకుళం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి గొప్పపౌరులుగా విద్యార్థులను అందించాలంటే సర్కారీ బడుల్లో మనం ఇచ్చినటువంటి అభ్యాసంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా గ్యారెంటీ ఇచ్చే వనరుల కేంద్రాలుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తు తరాలకు ఇచ్చే సంపద విద్య ఒక్కటేనని, దానికి పాఠశాలలు వేదికలు కావాలన్నారు. పలుచోట్ల అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నటువంటి ఈరోజుల్లో, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు సమష్టిగా సామాజిక రుగ్మతలపై పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్నటువంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వారధులుగా ఎస్ఎంసీలు ఉండాలని కోరారు. ప్రభుత్వానికి మంచిపేరు రావాలంటే యంత్రాంగం సక్రమంగా పనిచేసినప్పుడే సాధ్యపడుతుందన్నారు. డ్రగ్స్ మహమ్మారి విస్తరణపై కీలకమైన సూచనలు చేస్తూ దీనిపై ఓ ప్రత్యేకమైనటువంటి పోరాటం చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గార: సైబర్ నేరాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ రెల్ల జనార్దనరావు సూచించారు. శనివారం సాయంత్రం తూలుగు పంచాయతీ ఉప్పరిపేటలో సంకల్పంలో భాగంగా మత్తు పదార్థాల వాడకం వలన నష్టాలు, డిజిటల్ అరెస్టులు, ఫేక్ ఫోన్ కాల్స్‌పై వివరించారు. ఎటువంటి ఇబ్బందులొచ్చినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. గంజాయి, మద్యంతో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 2025–26 వార్షిక అంచనా బడ్జెట్, 24–25 సవరణ బడ్జెట్ ఆమోదంపై సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పన్నులు రూపంలో వచ్చిన ఆదాయాలతో ప్రజా అవసరాల మేరకు పనులు జరిగేలా నిర్ణయాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మార్పు సుజాతమ్మ, ఎంపీడీవో శిమ్మ రామ్మోహనరావు, వైస్ ఎంపీపీలు అంధవరపు రామలక్ష్మీ, అరవల శార్వాణి, ఏవో రఘు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిశోధన పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి: విశాఖపట్టణం జిల్లా భీమిలి గోస్తాని ఉప్పు నీరు, మంచి నీరు అలల ప్రాంతంలో ఉన్నటువంటి వివిధ రకాల చేప జాతులను గుర్తించి వాటి జీవ వైవిధ్యంపై పరిశోధనలు చేసి రాసిన పుస్తకాన్ని శ్రీకాకుళంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా శనివారం ఆవిష్కరించారు. విశాఖపట్నం కృష్ణా కళాశాల జువాలజీ ప్రొఫెసర్ కర్రి రామారావు, శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వెలమల హారతి, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రామచంద్రరావు తదితరులు సుమారు 18 నెలలు శ్రమించి 60 రకాల చేప జాతులు ఉన్నట్లు పరిశోధనలో గుర్తించారు. ఇందులో పెర్చ్ జాతికి చెందిన చేపలు అత్యధికంగా ఉన్నాయని వివరించారు. ఈ పుస్తకంలో పరిశోధించిన అంశాలు చేప జాతులపై ఆక్వా రంగంలో పరిశోధనలు చేస్తున్న విద్యార్థులకు, పరిశోధకులకు, మత్స్యకారులకు గుర్తించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని రచయితలు వివరించారు. ఈ సందర్భంగా రచయితలకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.

ఆదిత్యుని సన్నిధిలో యూత్ సర్వీసెస్ కమిషనర్ శారద



శారదాదేవికి జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని నేషనల్ యూత్ సర్వీసెస్ కమిషనర్ కె.శారదాదేవి శనివారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కనకరాజు, ఆలయ అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జిల్లా సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ మీడియా సెల్ ఇన్‌చార్జి మండవల్లి రవి తల్లి తాయారమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ రవిని శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

పారదర్శకంగా ఉండాలి

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల ఖాతాలు పారదర్శకంగా ఉండాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్, సెర్ప్ రీసోర్సు పర్సన్ మోహనరావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో సెర్ప్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కమ్యూనిటీ బేసెడ్ ఆర్గనైజేషన్‌లో సబ్ కమిటీల పాత్ర శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా గ్రామం యూనిట్‌గా సంఘాలు బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు. సంఘాల బలోపేతం, పారదర్శకంగా ముందుకు సాగడం, అక్రమాలకు తావ లేకుండా సాగడం జరగాలంటే సబ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. సంఘంలో ఉన్న ప్రతీ మహిళకు తీసుకున్న అప్పు, చెల్లిస్తున్న వాయిదాలు, సమావేశపు తీర్మానాలపై అవగాహన అవసరం అన్నారు. కార్యక్రమంలో ఏసీలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతను శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని సజావుగా నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను చేశారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు మాట్లాడుతూ తమతమ శాఖలు ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజాప్రతినిధులకు వివరించారు. పెద్ద కొత్తపల్లి సర్పంచ్ ఆరెళ్ల కృష్ణ మాట్లాడుతూ సచివాలయానికి రహదారి లేకుండా పోయిందని, దీనివలన ప్రజలు సచివాలయానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయానికి రహదారి ఏర్పాటు చేయాలని కోరారు. గోవిందపురం సర్పంచ్ పిల్ల గోవిందరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆన్‌లైన్ చేసినవారికి ఇప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదని, ఇప్పుడు నూతనంగా పెట్టినవారికి ఇస్తున్నారన్నారు. అప్పట్లో దరఖాస్తులు చేసుకున్న వారికి కూడా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కొత్తకుంకాం ఎంపీటీసీ దొండపాటి శివ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రొక్కం బాలకృష్ణ, ఎంపీడీవో పి.వెంకటరాజు, ఆర్ఐ శ్రీను, సీడీపీవో ఝాన్సీరాణి, వెలుగు ఏపీఎం సుబ్బయ్యనాయుడు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యవతి, హౌసింగ్ ఏఈ రమేష్, ఎలక్ట్రికల్ ఏఈ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని దమ్మలవీధిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితులను డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు శనివారం పరామర్శించారు. జరిగిన ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ ప్రమాద బాధితులకు తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. బాధితులను పరామర్శించినవారిలో కాంగ్రెస్ నాయకులు రెల్ల సురేష్, చాన్ భాషా, భాషా బాబు, షాహిదుల్లా ఖాన్, ఉస్మాన్, అంబటి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

అలరించిన స్వరమాధురి

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఘంటసాల, జి.ఆనంద్, బాలు(జీబీఏ) స్వరమాధురి వెల్ఫేర్, సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘంటసాల 102వ జయంతి ఉత్సవాలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా విజయనగరానికి చెందిన ప్రముఖ గాయకులు బి.ఎ.నారాయణ చక్కనైన గీతాలను చక్కగా గానం చేశారు. వీరికి బంగారు రమణమూర్తి సంగీత సహకారం అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నిక్కు అప్పన్న, ఎంవీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఎస్ఎస్‌డీసీ ద్వారా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు కమిషర్ పి.వి.వి.డి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్స్, ఏసీ, గ్రీజర్, రిఫ్రిజరేటర్, వాషింగ్ మెషిన్ రిపేర్, బ్యూటీషియన్, పెయింటర్స్ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వబడునని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 30వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు నగరపాలక సంస్థ పరిధిలోని రైతుబజారు వద్దనున్న మహిళా మార్ట్‌పై ఎంపీసీఆర్‌సీ భవనం వద్ద రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పాన్‌కార్డు జిరాక్సు కాపీలతో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

తలనీలాల వేలం ఖరారు



అరసవల్లిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రానున్న ఏడాది పాటు తలనీలాల హక్కులకు గాను నిర్వహించిన వేలం పాటను అనంతపురం జిల్లా హిందూపురం వ్యాపారి ఎస్.నాగరాజు రూ.70,02,000 మొత్తానికి దక్కించుకున్నారు. శనివారం ఆలయ మండపాల్లో తలనీలాలు, కొబ్బరిముక్కలు, ప్రసాద రసవర్గాలకు ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో శ్రీకూర్మం ఈవో గురునాథరావు సమక్షంలో వేలం నిర్వహించారు. కొబ్బరిచెక్కల వేలం పాటకు ఒకే పాటదారుడు హాజరుకావడంతో నిబంధనల ప్రకారం వాయిదా వేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. అలాగే కొంతకాలం క్రిందట స్టాకుగా ఉన్న తలనీలాలకు వేరుగా పాట నిర్వహించినప్పటికీ...మార్కెట్ రేటు ప్రకారం కూడా పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేసారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.